

# అభాజనుడు

శ్రీ నేమాని వాసుదేవమూర్తి.

"ధనవంతుడననే అహంభావం అతనికి గాఢంగా ఉండేది. అదే తన హృదయాన్ని తన స్వాధీనంలో లేకుండా చేసింది. కర్మ పరిపక్వమయితేనే గాని అది చంచలమని గ్రహించలేక పోయేడు; అభాజనుడు".

ప్రసాదరావు సుమారు ఇరవై యెనిమిదేండ్ల వయస్సు. మూడవఫారంతో ముగించిన విద్యావంతుడు. భావార్థములు; తప్పొప్పులు గణింపక మాటలాడు, ఆంగ్లేయభాషాప్రవీణుడు. అర్థముకాకున్ననూ, ఆంగ్లేయ పత్రికా పత్రముల నవలీల ద్రిప్పే భేషజుడు. తనకు తాను పొగడుకునే స్వార్థసుందరుడు. ఇతరుల పొగడ్తలు గ్రహింపక సుప్పొంగిపోవు అవివేకి. ఒకలక్షకు అధికారి.

తనకు తెలియని హంశము లేదని యీతని వూహ. తనకే ప్రత్యేక అంశమేనా తెలియదని యెదిరించువ్యక్తికి తనవద్ద గౌరవం జరుగదు. తానెక్కడయినా యేదయినా విషయం కర్ణాకర్ణిగా వింటే, దానిపై పునాదులు వేసి, గోడలుకట్టి, బాగా ప్లేస్టర్ చేసి ఊహాసౌధం నిర్మిస్తాడు. ఈతని సంగతి పూర్తిగా తెలియని వాడెవడేనా కలిసేడంటే, ఆనాడు తాను కోసే కోతలకు మితి ఉండదు. తనకు తెలిసిన యేయితరవ్యక్తి ఆ సమీపంలో వుండకూడదు. అంతే! ఈమధ్య ఒకాయన మా "జూబ్లీహాలు" వద్ద యీతన్ని కలిసి, అయ్యా! మీరేం చేస్తూన్నారని అడిగేసరికి 'I am the Deputy Thasildar on leave' అని జంకు గొంకులేకుండా చెప్పేశాడు. వారి వెనుకనే సంధ్య చీకటిలో నడుస్తూన్న, మా మిత్రరత్నం యీ హంశాన్ని వెంటనే తనడైరీలో ఎక్కించుకొని, మా 'బాతాఖానీ' పత్రికలో దాన్నొకశీర్షికగా దింపేడు. ఇన్నెందుకు? కోతలరాయుడంటే చాలు పూర్తిగా అవగాహం చేసుకోవచ్చు. మరి యేయితర చెడువర్తనలు అతనిలో అప్పటికిలేవు. వజ్రహృదయుడు. డబ్బుకూడా జాగ్రత్తగానే ఖర్చుపెట్టేవాడు అప్పటిలో.

౨

స్వామినాథశాస్త్రి ఆ పట్టణంలో ధనవంతుడు అతని కుటుంబం, తాను, భార్య కుమార్తెమాత్రమే. కుమార్తెపేరు 'రాజ్యం.' ఆతనాయూరిలో పేరుకెక్కిన తెనుగువైద్యుడు. నలభై సంవత్సరముల వయస్సు. చామనచాయ శరీరం ఖద్దరు వస్త్రధారి. రోజుకు రెండు వందల గజాలయినా నూలు తీయకుండా అతడు నిద్రపోడు. దేశాభిమాని. కట్నమీయకుండా కూతురుపెండ్లి చేయాలని యీతని దీక్షయినప్పటికి ఆ రోజుల్లో అది కొనసాగిందికాదు. కూతురు సుఖపడుతుందనే వుద్దేశంతో, ఎన్ని వురుషాంతరాలకేనా కట్టుకుందకి, తిండికి లోపంలేదని, ప్రసాదుడు విద్యాధికుడు కాకపోయి నప్పటికి, అయిదువేల కట్నంతో, రాజ్యం భావిజీవితం ప్రసాదుచేతిలో ధారపోశాడు. రాజ్యం కాపురానికొచ్చింది. కొన్నిదినాలన్యోన్యంగా భార్యాభర్తలిరువురు గడిపేరు. గాని సంతానం మాత్రం లేదు.

ఆమె అత్తింటికివచ్చిన నాటినుండి పతిసేవ చేస్తూ, సమయం లభించినపుడు రాట్నం త్రిప్పుతూ, భాగవతం మొదలగు పురాణ గ్రంథాలు చదువుకుంటూ, కాలంగడిపేది. ఆమె కితర వ్యాపృత్తిలేదు. ముఖంనిండా పసుపు రాసికొని, దేవునిపూజ చేసుకొంటూ లక్ష్మీదేవిలాగ ఆ యింట్లో పడివుండేది. వీధి గుమ్మం యేలాటిదో యెరగదు. వీరి యాన్యోన్య

ప్రేమాతిశయంచూచి దేవుడు సహితం సహించలేక పోయేడు కాబోలు, పండులాంటి సంసారానికి చిక్కులు సంప్రాప్తించేయి.

## 3

సహవాసదోషంవల్ల అలకరాజనే వేశ్యా సంపర్కం కలిగింది ప్రసాదునకు. ఆ కారణంచేత సంచులు విప్పటం ప్రారంభించేడు. రాత్రిం బవళ్ళామె యింట్లో పడివుండేవాడు. సాయంత్రం వెళితే విహార మందిరానికి లేకపోతే బీచి షికారు. అప్పటప్పుడు రాత్రులందు అలకరాజుతో సినిమా. భూములు చూచేటందుకు ఒక గుమస్తాను వేసుకున్నాడు. భూముల ప్రసక్తి తన కవసరం లేకపోయింది. తనకు కావలసినప్పుడల్లా పది, పాతిక గుమస్తా- భూములమీదికి వెళ్ళేవాడు డబ్బు తెచ్చియిచ్చేవాడు. రానురాను అలకరాజుమీద నుఅరాగం మిక్కుటమయింది. భోజనానికయినా రాకుండా రాత్రులామె యింటే వుండిపోతూయుండడం, మద్యపాన మాంస భక్షణలు ప్రారంభించేడు. తుదకా తనిప్రేమ, అలకరాజు తనవద్ద లేకపోతే తన జీవితం వ్యర్థం అనుకున్నంతవరకూ పరిణమించింది.

ఆనాడాదివారం. సాయంత్రం సుమారు 6 గంటలు కావచ్చింది. ప్రసాదు వెనుక నలకరాజుతో యింట్లో ప్రవేసించేడు.

'రాజ్యం'! అని పిలిచేడు ప్రసాదు.

లోన గృహకృత్యాలు నిర్వహిస్తూన్న రాజ్యం వెనుక గదిలోనుండి వెలుపలికి వచ్చింది. నిశ్చేష్టురాలయి పోయింది. ఇదివఱకు ఆమెను యింటికెన్నడూ తీసికొనివచ్చి యెరుగడు. అయినా పతియాజ్ఞ. ఆమె తలవంచి నిరీక్షిస్తూంది

'రాజ్యం!' యీమె యెవరో తెలుసా?

..........................

మీ చెల్లెలు.

..........................

ఏమి మాట్లాడవు? నీకీమెరావడము యిష్టం లేదు కాబోలు.

"కూర్చో" అని రాజ్యం మెల్లిగాఅంది- పతికి కోపం వస్తుంది కదా అని.

ఇది యీదినం మన యింట్లో భోంచేస్తుంది. వాణ్ణి వడ్డించమ..

ఆతడిప్పుడే వండి వెళ్ళిపోయేడు, సినీమాకి.

అయితే మన ముగ్గురికి వడ్డించు. కలిసి భోంచేద్దాం.

నాకీ రోజు ఫలాహారం అని బొంకింది- వారితో భుజించడం యిష్టంలేక.

అయితే మా యిద్దరికి వడ్డించు. అన్నంవుందా?

ఉంది. పతియాజ్ఞ శిరసావహించింది.

ఇరువురు భుజించి శయ్యామందిరం చేరేరు.

అప్పట్లో రాజ్యానికి కర్తవ్యం యేమిటి? నిరాహారియై పండుకొన నిశ్చయించుకుంది. వయస్సా- నిండు యౌవ్వనం. ప్రాపంచిక సుఖాలు అనుభవించే సమయం. భావపూరితమైన కల్లోలహృదయంతో రసప్లావితమైన మనస్సుతో, యేమిచేయటానికి తోచక తివాచీపై ఒరిగింది.

అశ్రుబిందువులామె నేత్రాలనుండి అప్రియత్నంగా రాలిపోతున్నాయి. తన జీవితంలో ఆనందం అనుభవించడం యికమీద సున్న అనుకుంది. నిట్టూర్పు బుచ్చింది. నిరాశాంధగారం హృదయంలో- క్రమ్ముకుంది. అంతులేని తరంగములవలె వచ్చే భావాల్ని హృదయంలో యిముడ్చుకోలేక భోరున యేడ్వసాగింది. అంతకన్న నామె చేసేదేముంది? ఇట్టి కృత్యములే గృహలక్ష్మి సహింపగలదు?

## ౪

కలకంఠకంటి కన్నీరొలికిన సిరి యింట నుండ నొల్లదు, అనే వాక్యం వుట్టినే వుట్టిందా? ప్రసాద

రావు తాలూకు ఆస్తంతా హారతి కర్పూరం లాగ హరించి పోతూంది.

అలకరాజు ముద్దు చెల్లించేటందుకు, యిక్కడా అక్కడా, అప్పుతెచ్చిన డబ్బు కంతం లేదు. అందుచే రానురాను అప్పు అపరిమితంగా పెరిగిపోతూంది. ఇంక నావూళ్ళో అప్పు తీసుకువలసిన వారొక్కరూ మిగల్లేదు. వేశ్యా సౌకర్యాలకి తన ఖర్చులకు అప్పు టప్పట భార్య మెడలోని నగలు– తీయడం ప్రారంభిం చేడు.

ఇంటి గుట్టు బయటకు రాకుండా కాలక్షేపం చేస్తూంది. గృహలక్ష్మి– ఆ కుటీరంలో– పాపం!

అప్పుడే క్రెడిట్ బిల్లు తెచ్చి ప్రసాదరావు కిచ్చేడు– ఓ చిన్న అబ్బాయి ఓవల్ టీన్ లేదని అప్పుడే కబురంపింది అలకరాజు తన అన్నచేత. చేతిలో దమ్మిడీ లేదు. ఏం చేస్తాడు? అది తెచ్చి అప్పట్లో యీయకపోతే చిన్న పోతుంది. కొంచెం సేపు ఆలో చించేడు.

రాజ్యాన్ని పిల్చి మెడలోని పుస్తెలన్నా యిమ్మ న్నాడు. దాన్నమ్మివేస్తే బిల్లుపైకం యేకంగా చెల్లిస్తూ పైఖర్చుకు డబ్బు మిగుల్తుం దనుకున్నాడు.

తన మెడలోని ఆ ఒక్కనగ యిచ్చుట కామె సందేహిస్తూంది. మంగళ సూత్రాలు కూర్చబడి యుండటంచేత, వాటిని తీయవద్దని బతిమాలుకుంది. కాళ్ళపై బడ్డది. కాని ప్రసాదు మూరుడు బలవంతంగా ఆనగ లాక్కుపోయేడు.

ఆమె భోరున యేడ్చింది. నాయింట నీవు యేడ్వవద్దంటూ పుట్టినింటికి సాయంత్రం బండిలో తరిమి వేశాడు.

గృహలక్ష్మి గృహంవీడిన మరు దినంనుండి ప్రసా దుని ప్రవర్తన ద్విగుణీకృతం అయింది. ఆఖరుకి 'అలక రాజుని తెచ్చి యింట్లోపెట్టేడు.

7

పుట్టినింటికి చేరిననాటినుండి ఆమె కంట తడి పెట్టని ఘడియలేదు. ఇందుకుతోడు కడుపున నొక కాయమైన లేకపోవటం తనలోతాను కుమిలి కుమిలి జీర్ణించిపోయింది. తుదకు గుండె జబ్బుకూడా ప్రాప్తిం చింది. డాక్టర్లామెగూర్చి సందేహించేరు. తండ్రి మందులు స్వయంగా తయారుజేసి యిస్తూన్నాడు. తమ భూములు విక్రయింప బడుతూన్నాయని, ఆమె కెవరో తెలియజేసేరు. ఓనాడు పతికి రానున్న స్థితికి చింతించింది ఆ రాత్రి జబ్బు యెక్కువయిపోయింది. తనస్థితి తన పతికి తెలియజేయుమని బ్రతిమాలింది.

స్వామినాధశాస్త్రికి కబురంపటం యిష్టంలేక పోయినప్పటికి లోకనిందకు వెరచి, వుత్తరంవ్రాసాడు ఆమె స్థితిగతులు తెలియజేస్తూ.

అందుకు అనుకున్ననాటికి ప్రత్యుత్తరంగాని, మనిషిగాని రాలేదు. రైలువచ్చేవేళలలో రాజ్యం పతి రాకకు యెదురుచూసేది. లాభంలేక పోయింది. నిరాశ చేసుకుంది.

ఒక్కసారి "రసిపిపాసుడు. అయిదువేలు పోసి యీతన్ని కొన్నదెందుకు? ఆ కులటతో కులక టానికా? అనే వాక్కులు తీవ్రకంఠంతో ఆమెనోటి నుండి వెలువడ్డాయి, మరుక్షణంలో హిందూస్త్రీకి పతి దూషణ సమంజసంకాదని తన్నుతాను నిందించు కుంది. తన అపరాధాన్ని క్షమింపమని ఈశ్వరుని ప్రార్థించింది.

ఓనాడు తనబాధ ద్విగుణీకృతంగా వుందని తల్లిందండ్రుల కెరిగించింది. భాగవతంలోనివి, గజేంద్ర మోక్షం లోనివి పద్యాలు మనస్సులో చదువుకుంది తల్లినిపిల్చి కుంకుమ తెచ్చి తన నొసట బొట్టుపెట్టమంది. ఆయాసం సహించలేక పోతూంది. శయ్యపైవ్రాలింది.

కళ్ళు చీకట్లుక్రమ్మే యనుకొని తల్లి నీళ్ళు తెచ్చి ముఖంతుడిచి నోట్లోకొంచం నీళ్ళుపోసింది. మూసి

గుక్కిలుతాగి కండ్లు విప్పింది. తల్లిదండ్రులకు అంత్య నమస్కారంచేసి కళ్ళుమూసింది. అంతకు గాని ఆమెకు మనశ్శాంతి లేకపోయింది. అస్తమించింది

భార్య మరణవార్త సహితం ప్రసాదుని హృదయం కరిగింపలేక పోయింది. ప్రసాదుని స్థితి నలుగురూ కథగా చెప్పుకొనే యవస్థ వచ్చింది. అప్పుల వాళ్ళు డిక్రీలు పొంది అమల్లు చేయటం- ప్రారంభించేరు. ఇల్లు రెండుమూడు దినాల్లో వేలం వేస్తారు. ఆనాటి వేలంతో తానిల్లు విడువవలసి వస్తుంది యీ సమయం కనిపెట్టి అలకరాజు తన అన్నకి కబురంపి తెప్పించి, వేరొకచోట వేటాడబోయింది

ధనవంతుడననే అహంభావం అతనికి గాఢంగా వుండేది. అదే తన హృదయాన్ని తన స్వాధీనంలో లేకుండా జేసింది. అఖరుకు కర్మ పరిపక్వమయితేనే గాని అది చంచలం అని గ్రహించలేకపోయేడు- అభాజనుడు.

కర్తవ్యము ప్రసాదునకు అప్పట్లో అవగతం కాలేదు. అతనిపుడు నడి సముద్రంలో ఉన్నాడు. అంత ఘనంగా బ్రదికిన తాను, రానున్నకష్టాలనుండి తొలగిపోదామనే ఉద్దేశంతో ఆత్మహత్యా ప్రయత్నం చేసేడు, పాపం! అదీ కొనసాగింది కాదు.

పోలీసు వారి చేతుల్లో పడ్డాడు. 309 శెక్షను క్రింద ఛార్జి చేసేరు. ఆరు నెలలు కఠినశిక్ష విధింపబడి, అతనిపుడు కారా గార వాసం చేస్తూన్నాడు- చేసిన దుష్కృతాలకి పరితపిస్తూ.

---


## జీవబ్రహ్మైక్య రాజయోగ సారామృతము

ఇది కడప శ్రీపరమహంస సచ్చిదానంద యోగీశ్వరులవారిచే ముద్రింపబడినది.



1276-పుటలు, 48-పటములుగలది, మూడవ కూర్పు.

| | | |
|---|---|---|
| కాలికో బయిండు | రూ. | 4-4-0 |
| గూఢార్థ సంగ్రహ సహిత శ్రీ భగవద్గీత | రూ. | 2-4-0 |
| శ్రీ కబీర్ దాసు చరిత్రము | రూ. | 2-4-0 |
| శరీర జేలయ రహస్యార్థ పారిజాతము | రూ. | 0-6-0 |

### చిత్రగుప్త ఆఫీసు

సాకారుపేటపోస్టు, మదరాసు.